ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025 | 5 | శ్రీ సత్యసాయి





ఆగిన పనులు

హంద్రీనీవా పనులు అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను శుక్రవారం హెచ్.గొల్లహట్టి గ్రామా నికి చెందిన పలువురు భూ నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. నష్టపరిహారం ఇచ్చేంత వరకూ పనులను జరగనివ్వబోమని తేల్చి చెప్పారు.. వివరాలు.. మండలంలోని కరికెర పంచాయతీ హెచ్.గొల్లహట్టి గ్రామానికి చెందిన రైతులు చిత్తయ్య, కరియప్ప, శివన్న, రాజుకు సంబంధించిన సర్వే నెంబర్ 413లో 6.13 ఎకరాల భూమిని ప్రభుత్వం హంద్రీనీవా కాలువ కోసం తీసుకొందన్నారు. అయితే దీనికి సంబంధించిన పరిహారం రైతులకు ఇంతవరకూ అందలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని, కావున పరిహారం ఇచ్చేంత వరకూ కాలువ పనులు చేయరాదని అడ్డుకున్నట్లు తెలిపారు. పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి హంద్రీనీవా కాలువకు భూములు ఇచ్చి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

సాగునీటి నిర్వహణలో సమస్య తలెత్తనివ్వొద్దు

ఐఎబి సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

సాగునీటి నిర్వహణలో ఎక్కడా సమస్యలు రాకుండా చూసుకోవాలని నీటి పారుదలశాఖ అధికారులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం కలెక్టరు ఒ.ఆనంద్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు విప్ కాలవ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, జెసి అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా నీటి లభ్యత గురించి హెచ్ఎల్‌సి ఎస్ఇ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇలు వివరించారు. తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువ ఈ ఏడాది 80 టిఎంసిల వరకే చేపట్టాలని బోర్డు నిర్ణయించిన నేపథ్యంలో ఈ ఏడాది 24 టిఎంసిల వరకే నీరు తీసుకునేందుకు వీలుందని ఎస్ఇ వివరించారు. ఇప్పటి వరకు 16 టిఎంసిల వరకు తీసుకున్నట్లు వివరించారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్, విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ మిగిలిన ఎనిమిది టిఎంసిల నీళ్లను జనవరి ఆఖరు వరకు వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అంతలోపు నీరు తీసుకోవడం పూర్తయితే ఎగువ భాగంలోనున్న తుంగభద్ర ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కిందనున్న ఆయకట్టు రైతులకు ఇబ్బంది ఉంటుందని చెప్పారు. పంటలను పూర్తి స్థాయి సంరక్షించే విధంగా కలెక్టరు ఆధ్వర్యంలో మరోసారి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. పంటలకు చివరి వరకు నీరు ఇవ్వలేకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. హంద్రీనీవా ఎస్ఇ స్వరూప్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హంద్రీనీవా నుంచి 19 టిఎంసిల నీరు జిల్లాకు వచ్చిందన్నారు. ఇందులో 6.128 టిఎంసిలు నీరు పిఎబిఆర్‌కు ఇచ్చామని తెలిపారు. 10.284 టిఎంసిలు రెండో దశకు నీరు ఇచ్చినట్లు చెప్పారు. అనంతపురం జిల్లా పరిధిలో 42 చెరువులకు నీరిచ్చామని తెలిపారు. సత్యసాయి జల్లాలో 175 చెరువులకు నీరిచ్చేందుకు ప్రణాళిక చేశామన్నారు. ఇందులో ఇప్పటికే 40 చెరువులు పూర్తయ్యాయి. 30 చెరువులకు నీరుస్తామని వివరించారు. ఇంకో 107 చెరువులకు నీరివ్వాల్సి ఉందన్నారు. ఈ ఏడాది గతంలో ఎన్నడూలేని విధంగా 40 టిఎంసిలకు పైగా నీటిని తీసుకొచ్చేందుకు వీలుందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు అందుకు తగ్గట్టు అధికారులు పనిచేయాలని చెప్పారు. అదే విధంగా వచ్చే ఏడాది హంద్రీనీవా కాలువ వెడల్పును రెండో వైపు చేయడానికి వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మిడ్‌పెన్నార్ ఉత్తర కాలువ కింద ఆయకట్టుకు నీరందించే డిస్ట్రిబ్యూటరీల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. అదే విధంగా చాగళ్లు కింద ఆయకట్టు కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉందని అన్నారు. ఇవి చేయగలిగితే 80 వేల ఎకరాలకుపైగా పంటలు పండించేందుకు వీలుంటుందని చెప్పారు. మిడ్‌పెన్నార్ డ్యామ్ మరమ్మతులకు నిధులు విడుదల చేసినందుకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ధన్యవాదాలు తెలిపారు. మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ కింద నీరు ఎప్పటి వరకు ఇస్తారన్న దానిపై షెడ్యూల్ ఇప్పటి వరకు ప్రకటించలేదని, ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఎప్పుడు జులైలో జరిగేది, ఇప్పుడు అక్టోబరులో నిర్వహిస్తున్నారని అన్నారు. ఇక నుంచి ఆలస్యం లేకుండా సకాలంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఎల్ఎంసిపైన ఎగువ భాగంలో ఒక రిజర్వాయర్ నిర్మిస్తే హెచ్ఎల్ఎంసి ఆయకట్టుకు సమస్య ఉండబోదని సూచించారు. ఇప్పుడు ఆర్థికశాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ ఉన్నందున జిల్లాకు సాగునీటికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్-ఎస్, సాగునీటి సలహా మండలి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

ప్రజాశక్తి - ముదిగుబ్బ



గోడ పడిపోయిన దృశ్యం

గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని సుంకర వెంకటశెట్టికి చెందిన ఇల్లు కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇల్లు కారుతుండటంతో కుటుంబసభ్యులు గురువారం రాత్రి మరో గదిలో పడుకున్నారు. అర్థరాత్రి సమయంలో పెద్ద శబ్దంలో ఇల్లు కూలిపోయింది. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం తో ప్రాణ నష్టం తప్పింది. కానీ ఇంట్లో ఉన్న వస్తువులు, సామాన్లు పనికిరాకుండా అయ్యాయని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జిల్లాలో 560.8 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో గురువారం కురిసిన వర్షానికి 560.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా గణాంక శాఖ అధికారి గంగాధర్ తెలిపారు. అత్యధికంగా ముదిగుబ్బ మండలంలో 80.2 తాడిమర్రిలో 49.2, బత్తలపల్లి లో 46.6, నల్లమాడ లో 43.4, కదిరి లో 41.8, ధర్మవరంలో 33.6, తనకల్లులో 27.2, రామగిరి లో 23. 8, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా అగళి మండలంలో 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలో 32 మండలాలకు గాను గోరంట్ల, హిందూపురం, చిలమత్తూరు, మూడు మండలాలు మినహా 29 మండలాలలో వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పలు చెక్ డ్యాములు, కుంటలు నిండాయి.

పాఠశాల ఆవరణలో నీటి మడుగు, పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి - రొద్దం




పాఠశాల ఆవరణంలో నీటిమడుగు

మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో ఉన్న ఎంపియుపి పాఠశాల ఆవరణం నీటితో, పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా మారింది. పాఠశాల ప్రాంగణం ఎగుడు దిగుడుగా ఉండడం, వర్షం కురిస్తే నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దీనికి తోడు పాఠశాల పక్కనే మినరల్ వాటర్ ప్లాంట్ ఉండడంతో అందులో నుంచి వెలువడే వృథా నీరు పాఠశాలలోకి చేరి మడుగును తలపిస్తోంది. విధి లేని పరిస్థితుల్లో విద్యార్థులు ఆ నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషపురుగుల బెడద ఎక్కువైందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణం చదును చేయడంతో పాటు పిచ్చిమొక్కలు తొలగించాలని నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - పెనుకొండ



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కల తీగ

పట్టణ సమీపంలోని మడకశిర రోడ్డు జర్నలిస్ట్(ప్రెస్) కాలనీ వద్ద ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, నియంత్రికను తీగజాతి మొక్కలు అల్లుకుపోయాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎద్దైనా ప్రమాదం జరగకముందే పిచ్చిమొక్కలు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

అవినీతి అధికారులకు 'తూముకుంట' కల్పవృక్షం

మండలమీట్‌లో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-హిందూపురం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపిటిసి షమీం

అవినీతి అధికారులకు హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంట గ్రామం, పారిశ్రామిక వాడ కల్పవృక్షంగా మారిందని ఎంపీటీసీ షమీం ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి మండల వ్యాప్తంగా దాదాపు 28 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉన్నప్పటికీకొన్ని శాఖల అధికారులు మాత్రమే అది కూడా మండల స్థాయి అధికారులు కాకుండా కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. ముగ్గురు సెక్రటరీలు మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో ఎంపీపీ తో పాటు వైస్ ఎంపీపీలు, ఎంపీడీవో ఆనంద్ ప్రసాద్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు రావాల్సి ఉన్నప్పటికీ ఏ ఒక్క సమావేశంలో కూడా మండల స్థాయి అధికారులు పాల్గొనడం లేదని అన్నారు. ఇకపై జరిగే సమావేశాలకు తప్పనిసరిగా మండల స్థాయి అధికారులతో పాటు ప్రతి సెక్రటరీ పాల్గొనే విధంగా చూడాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించి పనితీరును వివరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వార్తలు చదివినట్లు ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదువుతున్నారే తప్ప గ్రామస్థాయిలో ఏ ఒక్క అధికారి కూడా కనిపించడం లేదన్నారు. ఈ సమావేశంలో జెడ్ పి టి సి నాగభూషణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

ప్రజాశక్తి-హిందూపురం



టిడిపి నాయకులు, కార్యకర్తల నిరసన

హిందూపురం శాసనసభ్యులు, సినీ నటులు నందమూరి బాలకృష్ణ ను ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ సర్కిల్ లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీలను, దిష్టి బొమ్మను ప్రదర్శిస్తూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చించి వేశారు. దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకోవటంతో పోలీసులకు టిడిపి నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈరమేష్ కుమార్, నాయకులు నాగరాజు, వెంకటేష్, చంద్రమోహన్, ఇందాద్, విజయ లక్ష్మి, పరిమళ, శ్రీదేవి, రామాంజమ్మ, ఖాన్ తో పాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో పురపాలక సంఘ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తు ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులను శుక్రవారం ఎస్ టి యు ఆధ్వర్యంలో శుక్రవారం అజీజియ పాఠశాల ఆవరణంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండల విద్యాశాఖ అధికారిగా తన సర్వీసును 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఎంఇఒ గంగప్పను సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రమోషన్లుకల్పించడం పై పెట్టిన శ్రద్ధ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలోనూ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 2 ప్రసన్నలక్ష్మి, ఎస్ టి యు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్, పట్టణ అధ్యక్షులు సమీవుల్లా, వివిధ పాఠశాలల హెచ్ఎంలు సామ్రాజ్యం, కష్ణమోహన్, రమణ, విజయ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. వెంకటేశులు మాట్లాడుతూ, అంతర్జాతీయ తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడంలో, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడంలో ఐక్యరాజ్యసమితి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగపు అధ్యాపకులు డా. రవి నాయక్, రసాయన శాస్త్ర అధ్యాపకులు పి. కళావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్. రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి-హిందూపురం



వైసిపి నాయకులకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

హిందూపురం పట్టణంలో గత ఐదు నెలల క్రితం జరిగిన స్తూపం తొలగింపుపై జరిగిన నిరసనలో పాల్గొన్న వైసిపి నాయకులకు పోలీసులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని రహమత్ పురం సర్కిల్ లో ఉన్న వైయస్సార్సీపి స్తూపాన్ని తొలగించడం పై అప్పట్లో ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అయితే అప్పట్లో పోలీసులు నాయకులపై అనుమతులు లేకుండా నిరసన చేపడుతున్నారని కేసులను నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం టూటౌన్ పోలీసులు 35 బిఎన్ఎస్ కింద నోటీసులు జారీ చేశారు. కార్యాలయంలో అందుబాటులో ఉన్న వైసిపి నాయకులకు నోటీసులను జారీ చేశారు.

ముస్లిములపై చంద్రబాబుది కపట ప్రేమ

వైసిపి నాయకులు ఫయాజ్ బాషా

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తెలుగుదేశం పార్టీ తొలి నుండి ముస్లిములపై కపట ప్రేమ ప్రదర్శిస్తోందని వైసిపి హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు ఫయాజ్ భాష విమర్శించారు. ముస్లిములను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చంద్రబాబు ఉపయోగించుకుంటున్నాడని ఆరోపించారు. శుక్రవారం హిందూపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఫయాజ్ భాష ముస్లిం మైనార్టీలతో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. దీని వల్లే ముస్లింలకు విద్య , ఉద్యోగ, రాజకీయ అవకాశాలు దక్కాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో మైనార్టీలకు మంత్రివర్గంలో మొండి చేయి చూపి మైనార్టీ శాఖ మంత్రి పదవిని నాలుగు సంవత్సరాలు తన వద్దే ఉంచుకున్నారని, చివరి 9 నెలలు మాత్రం ముస్లిం ఓటర్లు తమకు ఓటు వేయాలని నమ్మించడానికి ముస్లిం వ్యక్తిని మంత్రిని చేశారని విమర్శించారు. మాజీ జగన్మోహన్ రెడ్డి ముస్లింలను ఉప ముఖ్యమంత్రిగా, నలుగురికి ఎమ్మెల్యేలుగా, నలుగురికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారని తెలిపారు. ఇది జగన్మోహన్ రెడ్డికి మైనార్టీల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, వైకాపా మైనార్టీ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తో కలిసి జిల్లాస్థాయి రహదారుల భద్రత సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జీరో ప్రమాదాల మృతి కేసులు నమోదు కావడానికి అధికారులందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. అధికారుల నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో 429 ప్రమాదాలు జరగగా 255 మంది మృతి చెందారని 483 మంది గాయపడ్డారని చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రధాన మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరెన్స్ చేయాలని, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలల బస్సులకు రేర్ కెమెరా ఉండాలని ఈ మేరకు డిఇఒ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేసేవారి వాహనాల లైసెన్సులను సస్పెండ్ చేయాలన్నారు. అధిక వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గన్ వినియోగిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్ శర్మ, జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి, డిఇఒ క్రిష్టప్ప, డి ఎం హెచ్ఒ ఫిరోజ్ బేగం, ఆర్ అండ్ బి అధికారులు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత జిల్లాగా మారుద్దాం : జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా నిర్మించి యువతను కాపాడుకుందామని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్లో గంజాయి, మత్తు పదార్థాల నివారణపై జిల్లా స్థాయి ఈగల్ కమిటీ సమన్వయ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ భవిష్యత్తును బంగారు బాటలుగా ఏర్పరచుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో సంబంధిత అధికారులు విద్యార్థుల లో అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా తదితర విషయాలు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలపాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని కుటుంబాలు చిన్న భిన్నం అవుతాయన్నారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రభుత్వం ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారని ఈ వ్యవస్థ నిత్యం నిఘ పెడుతుందన్నారు. అనంతరం ఈగల్ క్లబ్ గోడ పత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం :
జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితుల రక్షణ, దోషులకు శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పి సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మూడవ మాస విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రెడ్డి బాలాజీ గత మాసంలో నమోదైన కేసుల గురించి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ చట్టాలు పౌరహక్కుల అవగాహనకు మానిటరింగ్ సభ్యులు అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రతినెల 30న ప్రతి మండలంలోని ఒక గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయడానికి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. కమిటీ సభ్యులు పలు సమస్యలు ప్రస్తావించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, కమిటీ సభ్యులు గంగులయ్య, శ్రీనివాస్ నాయక్, వీరనారాయణ, కష్ణమూర్తి, ఉమా శంకర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

స్పీడ్ బ్రేకర్లు వేయాలని ధర్నా

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక కొత్తపల్లి క్రాస్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతూ శుక్రవారం స్థానికులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కొత్తపల్లి క్రాస్‌లో కెనరా బ్యాంకు, హిందూపూర్, పెనుకొండ వెపు వెళ్లే రోడ్డు, ప్రయివేటు పాఠశాలలు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయన్నారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందని, దీనికి తోడు ఎప్పుడూ పశువులు, కుక్కలు సంచరిస్తుంటాయన్నారు. ఈ పరిస్థితుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కావున సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి, కొత్తపల్లి క్రాస్ సమీపంలోని నివాసాల ప్రజలు పాల్గొన్నారు.


విద్యార్థిని అక్షరరెడ్డితో ఉపాధ్యాయ బృందం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని ధనాపురం గ్రామ జడ్పీ హైస్కూల్ విద్యార్థిని అక్షరరెడ్డి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జ్యోతిర్మయి, పిడి నాగరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ అక్షరరెడ్డి ఇటీవల పరిగి జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14, 17 బాలికల విభాగంలో సెలెక్షన్ కమ్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటిందన్నారు. ఆమె ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే అండర్-17 ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయురాలు సునీత, ఎస్ఎంసి ఛైర్మన్ గంగరాజు, సభ్యులు అభినందించారు.

ఎంజెపి విద్యార్థిని ప్రతిభ


భవ్య శ్రీ

చిలమత్తూరు : మండలంలోని టేకులోడు ఎంజెపి కళాశాల విద్యార్థిని భవ్యశ్రీ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటింది. ఇంటర్ రెండో సంవత్సరం ఎంఈసీ చదువుతున్న భవ్యశ్రీ అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి 1500 మీటర్లు, 3 కిలోమీటర్ల పరుగు పందెల్లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఆమె తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో 1500 మీటర్ల పందెంలోనూ విజేతగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. భవ్యశ్రీ విజయంపై ప్రిన్సిపల్ ఎం.శోభారాణి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. భవ్యశ్రీ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు.

28న వైసిపి నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో ఈ నెల 28వ తేదీ వైసిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్క రించారు. కేతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ పట్టణంలో చేపట్టనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తే సామాన్య ప్రజలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్య అందదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంపీరియల్ ఫంక్షన్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని హిందూ పూర్ రోడ్డు గట్లులో నూతనంగా నిర్మించిన ఇంపీరి యల్ ఫంక్షన్ హాల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అన్ని హంగులతో సిటీ స్థాయిలో ఫంక్షన్ హాల్ అందుబాటులోకి తీసుకొచ్చారని యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో యాజమాన్యం, కౌన్సిలర్ ముస్తఫా పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు నగదు పంపిణీ

గోరంట్ల : 2024-25 విద్యా సంవత్సరంలో పట్టణంలోని జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుక్రవారం మైనార్టీ యువ నేత ఉమర్‌ఖాన్ నగదు అందజేశారు. పాఠశాల ఫస్ట్ ర్యాంకర్‌కు రూ. 5వేలు, ద్వితీయ ర్యాంకర్‌కు రూ. 3వేలు, తృతీయ ర్యాంకర్‌కు రూ. 2వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు ఉత్తమరెడ్డి, నరేష్, నిమ్మల శ్రీధర్, బోయ లక్ష్మీనారాయణ, నబిరసూల్, శ్రీనివాసులు, అజ్మతుల్లా, తదితరులు పాల్గొన్నారు.


విద్యా సామగ్రి అందజేస్తున్న దాత

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న జెసి మౌర్య భరద్వాజ్

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులను ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జెసి అధ్యక్షతన జిల్లా వినియోగాదరుల రక్షణ మండలి(డిసిపిసి) కమిటీ సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులు ఎటువంటి మోసాలకు గురి కాకుండా, ముఖ్యంగా బంగారం కొనుగోలు, రైతులు విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు కొన్నప్పుడు జరిగే మోసాలపై తూనికలు, కొలతల శాఖ సిబ్బంది విరివిగా తనిఖీలు నిర్వహించి అరికట్టాలన్నారు. ఆహార ఉత్పతుల్లో కల్తీ జరగకుండా ఆహార భద్రత శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా రవాణాలో ప్రయాణికులకు అధిక ధరలకు టికెట్ విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు బిల్ తప్పనిసరిగా తీసుకునేలా కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ వారు ప్రోత్సహించాలని తెలిపారు. వైద్యశాఖలో మందుల దుకాణాల్లో అధిక ధరలకు విక్రయించకుండా, అనధికారికంగా నిర్వహిస్తున్న మందుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల సమాచార కేంద్రదం, ఆహార నాణ్యత పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. వినియోగదారుల హక్కుల పట్ల పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యంతో అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా వినియోగాదరుల రక్షణ మండలి అధికారులు, వినియోగదారుల సంఘం సభ్యులు, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఔటర్ రింగ్ రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి-కదిరి అర్బన్


ఔటర్ రింగ్ బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల సమీపంలో ఉన్న ఔటర్ రింగ్ నూతన బైపాస్ రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. మదనపల్లి రోడ్డు పివిఆర్ కళ్యాణ మండపం సమీపంలో ఇప్పటికే ఎమ్మెల్యే కందికుంట ప్రారంభించడంతో బెంగళూరు, హిందూపురం పట్టణాలకు వెళ్లే వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. కుటాగుళ్ల సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు బైపాస్ పనులు కొంతవరకూ నిలిచిపోవడంతో వాటిని త్వరలోనే పూర్తి చేయడానికి ఎమ్మెల్యే పరిశీలించారు.

పాత్రికేయుల ఇళ్ల కోసం స్థల పరిశీలన

కదిరి టౌన్ : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక చొరవతో పాత్రికేయుల సొంతింటి కల నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల పలువురు పాత్రికేయులు ఎమ్మెల్యేను కలిసి ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పట్టణంలో పని చేస్తున్న పాత్రికే యుల నివేశన స్థలాల అంశాన్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో వివిఎస్.శర్మ, డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్‌ను ఆదేశించారు. దీంతో శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ సూచనల మేరకు సర్వేయర్ పాత్రికే యులతో కలిసి పట్టణ సమీపంలోని కొత్త బైపాస్ రోడ్డు వద్ద రెండు చోట్ల భూమిని పరిశీలించారు.

హంద్రీనీవా కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అమరాపురం


కాలువ పనులను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మండలంలోని అలదపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను శుక్రవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. అలాగే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి డిసెంబర్ లోపు అమరావరం చెరువుకు హంద్రీనీవా జలాలు అందించాలని సూచించారు. శాశ్వత కరువు నివారణతో పాటు ప్రజలకు తాగు, సాగునీరు అందించా లనే ఉద్దేశంతో త్వరలో సిఎం చంద్రబాబు ఈ ప్రాంతంలో జలహారతి కార్యక్రమానికి వస్తారని తెలిపారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, జడ్పిటిసి సభ్యులు సారక్క నరసింహమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు నరసింహమూర్తి, శివరుద్రప్ప, మారుతిప్రసాద్, దాదు, తిప్పేస్వామి, జయకుమార్, రఘు ఉన్నారు.

చోరీలపై ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే సమయంలో విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా తీసుకోవాల్సిన అంశాలపై శుక్రవారం పోలీసులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రైనీ ఎస్ఐ ప్రసన్న, సిబ్బందితో కలిసి బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు, ప్రయాణికులకు మాట్లాడుతూ ప్రయాణ సమయంలో అపరిచిత వ్యక్తులు ఏమార్చి విలువైన వస్తువులు, సెల్‌ఫోన్, తదితర వాటిని చోరీ చేస్తారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో చోరీలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని, శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆపద, అత్యవసర పరిస్థితుల్లో 100, 108, శక్తి యాప్, ఎసిఎస్, రూరల్ సిఐ 9440716832, ఎస్ఐ 9440796833కు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చునన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని గ్లోబల్ జెన్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిం చారు. కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లల్ల వైద్య నిపుణులు డాక్టర్లు కేశవులు, గురువరుణ్, వర్ష విద్యా ర్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచే వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులు రావడానికి మనం తీసుకొనే ఆహారమే కారణమని వివరించారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు రోజూ వ్యాయామం చేయాలన్నారు. విద్యార్థులు పిల్లలు వివిధ రకాల నమూ నాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, హెచ్ఎం మంజువాణి, డైరెక్టర్స్ సాయిసృజన, సాయిశ్రీధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

27న అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అగళి

ఈ నెల 27వ తేదీ మడకశిర మండలంలోని బేగార్లపల్లి గ్రామంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆవిష్కరిస్తారని జడ్పిటిసి ఉమేష్, టిడిపి మండల కన్వీనర్ తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు కుమార్‌స్వామి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి మండలం నుంచి టిడిపి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు.


విలువలతో కూడిన సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మానవత్వం, విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై సహాయ, సహకారాలు అందించాలని మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్‌పి.కుంటలో ఏర్పాటు చేసిన మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన తహశీల్దార్ దేవేంద్రనాయక్, ఎస్ఐ వలిబాషా, ఎంఇఒ సుబ్బిరెడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థలో సభ్యులుగా చేరి తమ ప్రత్యేకతను చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి మాధవరెడ్డి, ఎపిజిబి మేనేజర్ పిచ్చయ్య, విశ్రాంత ఉద్యోగి గంగిరెడ్డి, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గంగిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రంగారెడ్డి, నాయకులు శ్రీరామనాయుడు, నరసింహులు, దండే రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని కాంక్షించాలి

ప్రజాశక్తి-పెనుకొండ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జయప్ప

ప్రపంచ రాజ్యాల లక్ష్యం ప్రపంచ శాంతి కావాలని పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయప్ప పిలుపునిచ్చారు. కళాశాలలో శుక్రవారం రాజనీతిశాస్త్రం, చరిత్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పెరిగిన ఆధునిక విజ్ఞాన యుగంలో రాజ్యాల మధ్య అంతరాలు తొలగిపోవాలన్నారు. యుద్ధ వాతావరణం నెలకొనకుండా ప్రతి రాజ్యం ప్రపంచ శాంతికి కృషి చేయాలన్నారు. ప్రపంచ శాంతి సంస్థలు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు పిఎల్.కాంతారావు మాట్లాడుతూ మానవ పరిజ్ఞానంతో కనుగొన్న సాధనాలను మానవాళి ప్రయోజనాలకు మాత్రమే వాడటం ఉత్తమమన్నారు. ఐక్యరాజ్య సమితి రాజ్యాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో పాటు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐక్యుఎసి కోఆర్డినేటర్ బి.యశోదరాణి, కె.ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదంపై ఎమ్మెల్యేలు దిగ్భ్రాంతి

ప్రజాశక్తి యంత్రాంగం

కర్నూలు జిల్లాలో గురువారం అర్ధ రాత్రి దాటిన తర్వాత జరిగిన బస్సు ప్రమాదంపై శుక్రవారం కదిరి, పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్.రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఓ ప్రయివేట్ ట్రావెల్స్ ప్రయాదానికి గురై బస్సు అగ్నికీలల్లో కాలి బూడిదవడంతో అందులో ప్రయాణిస్తున్న 19మంది ప్రయాణికులు సజీవ దహనం కావడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని దుబాయ్ పర్యటనలో ఉన్న సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

యోగివేమన జలాశయం నుంచి నీరు విడుదల

ముదిగుబ్బ : మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండా సమీపాన ఉన్న యోగివేమన జలాశయం నుంచి నీటిని అధికారులు గురువారం విడుదల చేశారు. జలాశయానికి నీరు అధికంగా రావడంతో ముందస్తు జాగ్రత్త కోసం రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లు డిఇ రాజన్న తెలిపారు.

27న కదిరిలో కలెక్టర్ గ్రీవెన్స్

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల 27వ తేదీ కదిరి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఎస్.సతీష్ కుమార్‌తో పాటు డివిజన్‌లోని మండల అధికారులు హాజరవుతారన్నారు. అలాగే కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజన్, మున్సిపాలిటీల్లో యధావిధిగా గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుట్టపర్తి రూరల్ : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు 'లైంగిక నేరాల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. పోలీసు అధికారులు సమాజ శ్రేయస్సు, భద్రత కోసం పోలీసులు అందిస్తున్న సేవలు, త్యాగాలను వివరించారు. విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసి అమరులైన పోలీసుల త్యాగాలను వివరించారు. విజేత విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామని తెలిపారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు

తాడిమర్రి : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి. హెచ్ఎం అరుణ, మండల కోఆర్డినేటర్ పిడి అమరాంజనేయులు మాట్లాడుతూ వివిధ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ కృష్ణమోహన్ పాల్గొన్నారు. పోటీలను పీడీలు, పీఈటీలు ప్రతాప్‌రెడ్డి, రవి, గోవిందప్ప, కవిత, భవాని పర్యవేక్షించారు.

ఆలయంలో వేలం పాట

తాడిమర్రి : మండలంలోని చిల్లవారిపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీకాటకోటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ముదిగుబ్బ సిఐ శ్యామ్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, ఆలయ ఈవో బిఆర్.వెంకటేశులు సమక్షంలో బహిరంగ వేలాలు నిర్వహించారు. అందులో తలనీలాలకు గుంటూరు జిల్లాకు చెందిన చక్రధర్ రూ. 1.5లక్షలు, టెంకాయలకు కడప జిల్లాకు చెందిన శివకృష్ణారెడ్డి రూ. 4,70,500, గాజులు, బొమ్మల విక్రయానికి చిల్లవారిపల్లి గ్రామానికి చెందిన జి.రామశివరెడ్డి రూ. 25వేలకు దక్కించుకున్నారు.

రైతులకు అవగాహన సదస్సు

బుక్కపట్నం : స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య రైతులకు వరి పంటలకు సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో వచ్చే తెగుళ్లు, వాటి నివారణకు మందులను సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ శైలకుమారి, జిల్లా వనరుల కేంద్రం ఏవో చైతన్య, వ్యవసాయ అధికారి నటరాజు, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రొద్దం : గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని చెరుకూరు సమీపంలోని టింబక్టు కలెక్టివ్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. పెనుకొండ-మడకశిర ప్రధాన రహదారిలో టింబక్టు కలెక్టివ్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అతడి వయసు 55-60 ఏళ్ల వయసు ఉంటుందని గుర్తుపట్టిన వ్యక్తులు పెనుకొండ సిఐ-9440796841, రొద్దం ఎస్ఐ-9440901902కు సమాచారం ఇవ్వాలన్నారు.

పేకాట జూదరులు అరెస్ట్

తనకల్లు : మండలంలోని కోటూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ గోపి సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2,450 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-గాండ్లపెంట



కార్యక్రమంలో మాట్లాడుతున్న మక్బూల్

కూటమి ప్రభుత్వం తక్షణమే వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని కదిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బిఎస్.మక్బూల్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అత్తార్ చాంద్‌బాషా డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని రెక్కమాను, చామలగొంది, జిపి తండా, వేపరాల, జీనులకుంట, తదితర గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ నూతన వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేసి కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు చేస్తుందన్నారు. వైసిపి పాలనలో జగన్ 17 వైద్య కళాశాలలకు అనుమతులు తీసుకురాగా, చంద్రబాబు ప్రభుత్వం పేద పిల్లలకు వైద్య విద్యను దూరం చేయాలని చూస్తుందన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఎస్.ఫయాజ్‌అలీ, శంకర్‌నాయుడు, మేకల నరసింహులు, ఎం.కొండయ్య, కె.హుస్సేన్‌పీరా, లక్ష్మీనరసింహగౌడ్, ఎంపిటిసి లక్ష్మీదేవి, మహమ్మద్ ఇక్బాల్, అజీమ్, గోపాల్‌నాయక్, ఆంజనేయనాయక్, తదితరులు పాల్గొన్నారు.

27న విజయవాడలో సొసైటీ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-పెనుకొండ

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27వ తేదీ విజయవాడలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ యూనియన్ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవో-36, 90 మేరకు వేతనాలు, ఇతర ప్రయోజనాలు వెంటనే అమలు చేయాలని, జిల్లా స్థాయిలో సపోర్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, సంఘాల్లోని ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, 2019 నుంచి పని చేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరారు. సంఘాల షేరు ధనంపై 6శాతం డివిడెండ్, వడ్డీ తక్షణమే చెల్లించాలని, ఆదాయ పన్ను నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని, సహకార రంగాన్ని ప్రయివేట్‌పరం చేయరాదని, రైతులకు సహకార సంఘాల ద్వారా మాత్రమే రుణాలు మంజూరు చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం


సమావేశంలో పాల్గొన్న వైద్య అధికారులు, సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఎంఒ లక్ష్మీనాయక్, ఎంపిహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి గోపి నాయక్, డిఇఒ ధనుంజయరెడ్డి తెలిపారు. వారు శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించి మలేరియా, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే పిహెచ్‌సి ల్యాబ్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. వారి వెంట పిహెచ్‌సి అధికారులు, సిహెచ్ఒ శశికళ, ఎంపిహెచ్ఎస్ బేబీరాణి, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఆరోగ్య సిబ్బంది, ఎల్‌టి శ్రావణ్‌కుమార్, ఎంపిహెచ్ఎ రవికుమార్, రమణనాయక్, 104 పైలెట్ చింతా నాగరాజు, తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి సమస్యకు సత్వరన్యాయం : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సీనియర్ సిటిజన్లకు రెవెన్యూ కోర్టులో తప్పక న్యాయం చేకూరుతుందని ఆర్డీవో మహేష్ తెలి పారు. ఆర్డీవో మాట్లాడుతూ పట్టణంలోని లోనికోటకు చెందిన గుంజర లక్ష్మమ్మకు ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు సంతానం కాగా రెండో కుమార్తె లక్ష్మీదేవికి 59.5 సెంట్ల స్థలాన్ని దాన విక్రయం చేసిందన్నారు. అయితే ఆ తర్వాత లక్ష్మీదేవి తల్లి బాగోగులు చూసుకోకపోవడంతో వృద్ధురాలు రెవెన్యూ కోర్టును ఆశ్రయించిందన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు వృద్ధురాలి కుటుంబ సభ్యులతో విచారణ చేపట్టి వాస్తవాలు తెలుసుకుని కుమార్తెకు ఇచ్చిన దాన విక్రయం స్థలాన్ని తిరిగి లక్ష్మమ్మకు అప్పగిం చారు. ఈ మేరకు శుక్రవారం సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. లక్ష్మమ్మ మనవడు మహేష్ మాట్లాడుతూ రెవెన్యూ కోర్టులో ఇంత త్వరగా న్యాయం జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

గోరంట్లలో రేపు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

ఓబుళదేవరచెరువు : గోరంట్లలో ఈ నెల 26వ తేదీ చేపట్టిన వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వడ్డెర సామాజికవర్గం ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని ఒడిసి వడ్డెర సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. అలాగే ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక నాలుగు వరుసల రహదారి వద్ద వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్లు ఎక్కువగా ఉన్నా తగిన గుర్తింపు లేదన్నారు. రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని, రాజకీయ ప్రాధాన్యం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మస్తానమ్మ, నాయ కులు ఓబుల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, చంద్ర, చెన్నకేశవులు, గంగులప్ప, వీరాంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని అచ్చామియాపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కట్టుబడి గౌస్ లాజమ్‌కు శుక్రవారం సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ హాబీబుల్ రెహ్మాన్, డివిజన్ అధ్యక్షులు అయాజ్, ఎస్ఎంసి ఛైర్మన్ యుహనీస్ ఫ్యాన్లు అందజేశారు. అలాగే విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పుస్తకాలు, తదితర సామగ్రి అందజేశారు. దాతలు హాబీబుల్ రెహ్మాన్, అయాజ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో పాఠశాలకు మరింత చేయూతనందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో అచ్చామియా సాహెబ్, వలిపీర్, శర్మాద్, సిఆర్‌ఎంటిలు అన్సర్‌అలీ, నరసింహులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా 'ఎక్సైజ్' వాహనాల వేలం..!

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మడకశిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు శుక్రవారం గుట్టుచప్పుడు కాకుండా వేలం నిర్వహించి అయినవారికి చౌకగా అప్పగించినట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేలం నిర్వహించే అంశాన్ని ముందుగానే దినపత్రికల ద్వారా తెలియజేయడమే కాకుండా కార్యాలయం ముందు నోటీస్ బోర్డులో ప్రదర్శించాల్సి ఉంటుంది. కానీ గుట్టుచప్పుడు కాకుండా వేలం నిర్వహించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడినట్లు తెలుస్తోంది. దీనికి తోడు సాయంత్రం ఐదున్నర గంటలైనా ఎన్ని వాహనాలు వేలం వేశారు.. ఎంత ఆదాయం వచ్చిందనే పూర్తి సమాచారం ఇవ్వకుండా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ సమయం గడిపారు. ఈ విషయమై ఎక్సైజ్ సిఐను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

పోరంబోకు స్థలం పంచాయతీకి అప్పగించాలని వినతి

ప్రజాశక్తి-రొద్దం

ప్రధాన రహదారి పక్కన ఉన్న పోరంబోకు స్థలాన్ని పంచాయతీకి అప్పగించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో రొద్దం గ్రామ చివరలో సుమారు 15సెంట్ల పోరంబోకు స్థలం ఉండగా హద్దులు ఏర్పాటు చేశామని, తహశీల్దార్, అధికారులు కూడా పరిశీలించారన్నారు. అయితే మరుసటి రోజే చుట్టుపక్కల పొలాల రైతులు ఆ స్థలాన్ని దున్ని దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. కావున అధికారులు స్పందించి విచారణ చేసి ఆ స్థలాన్ని పంచాయతీకి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీరాంజనేయులు, సిద్ధన్న, చెన్నకేశవులు, చిరంజీవి, రామకృష్ణ, ఉమాశంకర్, క్రిష్టప్ప, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో జగన్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఎమ్మెల్యే బాలకృష్ణపై వైసిపి అధినేత జగన్ వ్యాఖ్యలు సరికాదని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలయ్యపై జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం టిడిపి శ్రేణులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జగన్ అసెంబ్లీకి రాకుండా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. జగన్ వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కోఆర్డినేటర్ రంగారెడ్డి, కన్వీనర్ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, బాలాజీ, గౌరీశంకర్, మల్లికార్జున, డీలర్ రాజు పాల్గొన్నారు.


జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిడిపి నాయకులు